# నిజాయతీ

బస్సులో కిటికీదగ్గిర కూర్చుని, వెనక్కి వెళ్ళి పోతున్న పొలాలకేసి చూస్తోంది కల్యాణి. వేసిన ఎరువూ, చేసిన శ్రమా ఫలించి కోతకు అందివచ్చాయి పొలాలు. అలాగే తను గడిచిన పదేళ్ళుగా పడ్డ శ్రమ ఫలించింది. ఫలితం చేతికి వచ్చింది. గుట్టలూ, కొండలూ గడిచి, రాళ్ళూ, ముళ్ళూ దాటుకుని నున్నని తారు రోడ్డుదగ్గర ఆగి బస్సెక్కి గలిగింది తన జీవితం.

దాదాపు రెండు సంవత్సరాలైంది తను ఇటుకేసి వచ్చి - ఆ రోజు, ఆదుర్దా నిండిన మనస్సుతో ఎలాగో బస్సులో ఎక్కి వెళ్ళిపోయింది. ఈ రోజు నింపాదిగా కిటికీ దగ్గర కూర్చుని ఈ పరిసరాలన్నీ జ్ఞాపకం తెచ్చుకుని ఆనాటి స్మృతుల్ని నెమరువేసుకో గలుగుతున్నది. తన ఈ అభివృద్ధీ, ఆనందం - వీటన్నిటికీ కారకులైన వారి దగ్గరకు తను ప్రస్తుతం వెడుతోంది. వారు తనని చూసి సంతోషించి ఆదరించి, ఆత్మీయత పంచి యిస్తారనే ఆశతో, కృతజ్ఞత చెప్పుకుందామన్న ఆరాటంతో వెడుతున్నది. తను కట్టుకున్న పెద్ద పెద్ద పువ్వుల వాయిల్ చీరకేసీ, తను కాళ్ళకు

వేసుకున్న ఎత్తు మడమల చెప్పులకేసీ, తన చేతిలోని హ్యాండ్ బ్యాగ్ కేసి చూసుకుంది.

పది సంవత్సరాలక్రిందట.....

ఆరోజు తను నిద్ర లేచేసరికి అమ్మ గడప కానుకుని కూర్చుని రెండు కాళ్ళమధ్య తల ఇరికించుకుని ఏడుస్తున్నది. అమ్మ ఇలా ఏడవడం కల్యాణి చాలాసార్లు చూసింది. ఆవిడ అలా ఏడుస్తుంటే కల్యాణికి ఆవిడమీద జాలి వేయకపోగా, అసహ్యం వేసేది. 'ఏడుపు! ఏడుపు! అలా ఏడవడానికి సిగ్గులేదూ?' అని గట్టిగా అరిచి ఆవిడతో పోట్లాడాలని అనిపించేది. కానీ అమ్మతో పోట్లాడ్డం అంటే, అదెంత అనర్థమో ఎరుగును కనుక తనలో తనే గొణుక్కుంటూ పూరుకునేది కల్యాణి - అప్పుడు కల్యాణికి పదమూడేళ్లు.

"వోణీలు వేసుకోరాదూ!" అని ఇరుగూ పొరుగూ అనేవాళ్ళు - "ఓ చీరెముక్క చింపి యిద్దామన్నా నాకున్నది రెండే చీరెలు! విడవా, మడవా వున్నాయా ఏం?" అని అమ్మ సాధిస్తూ వుండేది....

అంచులు పగిలిపోయి మడమలపైకి వున్న మాసిన పరికిణీ, ఎవరో ఒకరు ధర్మం చేసిన ఆవిలేని జాకెట్టూ, కొబ్బరినూనెతో కనీసం ఇరవై రోజులదాకా పరిచయం వుండని చింపిరి జుత్తూ - అదీ కల్యాణి వాలకం.

పది రోజులకో, వారానికో ఒకనాడు అమ్మ ఎక్కడో వంటకి వెళ్ళేది.

ఆరోజు పదో, పరకో డబ్బు పట్టుకొచ్చేది - తెచ్చి న్నాడు గబగబా తనకీ, తమ్ముడికీ ఇంత అన్నం వండి వార్చేది. అందులోకి కూరా, పప్పూ, పెరుగూ అమర్చేది. చిరుతిండి కొనిపెట్టేది - ఆ రాత్రి అందరూ సినిమా చూసే వాళ్ళు - మర్నాడు మళ్ళీ పొయ్యిలో పిల్లి లేచేదికాదు. ఇరుగు పొరుగుతో సఖ్యతలేదు. వెళ్ళినచోట నుంచీ వీలుంటే ఓ గ్లాసో, చిన్న గిన్నో, ఆఖరికి ఓ గుడ్డముక్కో ఎత్తుకొచ్చేది. అమ్మ పుట్టడం మంచి సంప్రదాయం కల కుటుంబంలోనే - మరి నాన్నతో లేచి వచ్చాక, దరిద్రమే ఆవిణ్ణిలా తయారు చేసింది. దరిద్రమంత భయంకరమైనది ఇంకొకటుం వుంటుంది!!

కల్యాణి లేచి ముఖం కడుక్కుంది. గబగబ ఇన్ని మంచినీళ్ళు తాగింది. తల్లికి ఎదురుగా కూర్చోడం యిష్టం లేక, గూట్లోనుంచి ఇరిగిపోయిన దువ్వెన తీసుకుని తల దువ్వుకుంటూ వీధి గుమ్మంలో నిలబడింది.

కల్యాణి ఎంతసేపటికీ, తన్ని పలకరించడంలేదని గ్రహించాక తల్లే తల ఎత్తి, “నిన్న మధ్యాహ్నంనించీ గోవిందుడు కొంపకి రాలేదు - దేవుడోయ్ - నా ఒక్కగానొక్క కొడుకూ ఏమైపోయినాడో! నాయనోయ్-” అని శోకాలు ప్రారంభించింది. కల్యాణికి తెలుసు - గోవిందుడంటే అమ్మకి ప్రాణం - ఒక్కోరోజు తనకి అన్నం లేకపోయినా గోవిందుడికి చాటుగా పెట్టుకొనేది. గోవిందు కల్యాణికన్నా రెండేళ్ళు చిన్నవాడు - వాడికి పదకొండేళ్ళు - వాణ్ని ప్రక్కలో పెట్టుకుని వాడి నడుంమీద చెయ్యివేసి పడుకుంటుంది. వాణ్ణి పసి

వాడిని ముద్దాడినట్లు ముద్దు పెట్టుకుంటుంది. వాడి బట్టలు సబ్బులో వేసి వుతుకుతుంది. చిరుగులు కుడుతుంది. తలకి నూనె రాసి దువ్వుతుంది - తన తల పేలతో నిండిపోయి తను రాత్రిపూట లేచి కూర్చుని రెండు చేతుల్తో గోక్కుంటున్నా, ఒక్కనాడైనా తనని దగ్గర కూర్చోపెట్టుకుని, తల దువ్వి జడ వెయ్యదు.

గోవిందు నిన్న మధ్యాహ్నం నుంచీ కనపడటం లేదు- నిన్న సాయంత్రం తను చాలాసార్లు అడిగింది. కానీ తల్లి జవాబు చెప్పలేదు. ఏమీ పట్టనట్లు వూరుకుంది-పైగా ఇంట్లో ఒక స్టీలుగ్లాసు, రెండు ఇత్తడిగిన్నెలూ వుంటే వాటిని పనిచేసుకునే మాణిక్యానికి అమ్మివేసింది. ఇల్లు ఖాళీచేసి వెళ్లేదానిలాగ అక్కడి డబ్బులు ఇక్కడా, ఇక్కడి డబ్బులు అక్కడా పెట్టి హడావుడి పడిపోయింది.

రాత్రి తొమ్మిదైనా గోవిందు రాలేదు. తనకి తిండి సహించలేదు.

"అమ్మా గోవిందు రాలేదేం?" అని మళ్ళీ అడిగింది కల్యాణి -

అప్పుడు ఆవిడ చెప్పలేదు - ఎంతో రాత్రిదాకా కల్యాణికి నిద్ర పట్టలేదు. తన తమ్ముడు గోవిందు - ఎంత మంచివాడు! అయ్యో! ఎక్కడున్నాడు గోవిందు! ఎల్లా వస్తాడు గోవిందు!

కొంతసేపటికి కల్యాణికి ఏవో ఆలోచనలు వచ్చాయి.

బ్రాడీపేట నాలుగో లైనులో సుబ్బారావుగారని వున్నాడు. ఆయన భార్య ఈమధ్యనే పోయింది - ఆయనకి యాభై ఏళ్ళుంటాయి. భార్యపోయినాక, కూతుళ్ళూ, కోడళ్ళూ ఎవరూ ఆయనకోసం వుండలేదు - పెద్ద ఇల్లు - అమ్మ రెండు నెలలు ఆయనకి వంట చేసిపెట్టింది. అప్పుడు రోజూ కారేజిలో అన్నం, కూరలు తెచ్చేది. పిండివంటలూ, పళ్ళూ కూడా తెచ్చేది. సుబ్బారావుగారి భార్య చీరెలు కూడా చాలా తెచ్చి కట్టింది - ఆయ నిప్పుడు వైజాగ్ వెళ్ళిపోయి - అక్కడ స్థిరపడదామని అనుకుంటున్నాడని అమ్మ చెప్పేది. సుబ్బారావుగారింటికి అమ్మ రోజూ వెడుతూ వుంటుంది. ఒక్కరోజు రాత్రిపూట కూడా రాదు - తనూ గోవిందూ బిక్కు బిక్కు మంటూ పడుండేవాళ్లు - నిన్న ప్రొద్దున సుబ్బారావుగారు స్వయంగా తమ ఇంటికి వచ్చారు- అమ్మతో మాట్లాడారు. అమ్మ తనని సాంబమూర్తి గారింటికి వెళ్ళి గిన్నెలు కడిగిరమ్మని పంపేసింది - వాళ్ళేం మాట్లాడారో తను వినలేదు - మధ్యాహ్నం గోవిందుకు వున్న వాటిల్లో మంచి బట్టలు వేసింది. వాడు బయిటికి వెళ్లేటప్పుడు తను అడిగింది. "ఎక్కడికిరా వెడుతున్నావు ?" అంటే, "ఇప్పుడే వస్తానక్కా-" అని గబగబా వెళ్లిపోయాడు. అంటే, అమ్మే గోవిందుని ఎక్కడికో పంపేసిందన్నమాట - అంతేనేమో ! తనకి చెబితేనేం ! కల్యాణికి అమ్మమీద కోపమొచ్చింది-ఏడుపొచ్చింది. కానీ అమ్మదగ్గర ఏమాత్రం చనువులేని కల్యాణి ఒక్కతే ఏడుస్తూ ఎప్పటికో నిద్రపోయింది. అప్పుడు ఏమీ ఎరగనట్లు వూరుకుని, ఇప్పుడు శోకాలు పెట్టడం

ఎందుకోనని మొదట్లో ఆశ్చర్యపడింది తను. తరువాత మళ్లీ అమ్మమీాద కోపమొచ్చింది.

"నువ్వేగా! నిన్న మధ్యాహ్నం వాణ్ణొక్కడికీ పంపావు!" అన్నది ధైర్యంచేసి -

ఆ మాటతో ఆవిడ ఏడుపు మరీ ఎక్కువైంది.

అసలు కల్యాణి మూలంగానే తను పనికిమాలిన వారితో లేచి రావల్సొచ్చిందట. అది కడుపున పడ్డం మూలంగానే తను పరువు కాపాడుకోవడంకోసం. నాన్నతో లేచొచ్చిందట - అప్పట్నించీ అన్నీ కష్టాలేనట-తన బ్రతుకే దరిద్రపు బ్రతుకట - తనకంతా తండ్రి పోలికేనట - తల్లి తండ్రుల చాటున బ్రతుకుతూన్న ఆ మనిను లేవదీసుకొచ్చి ఇద్దరు పిల్లలుపుట్టాక, దేశాలమీాద పోయిన పనికిమాలినవాడి కూతురికి అలాంటిబుద్ధులురాక ఎలాంటివి వస్తాయిమరి! ఇలానే ఇంకెన్నోఅంది-నాన్న చేసిన అన్యాయాలన్నీ ఏకరువుపెట్టి ఆవిడ ఏడుస్తూవుంటే - నాన్నమీాద కోపం - అమ్మమీాద జాలీ కలగడానికి బదులు అమ్మమీాద కోపం, నాన్నమీాద జాలీ కలిగాయి కల్యాణికి - ఆవిడలా ఏడ్చి ఏడ్చి - చాలా సేపటికి లేచి కూర్చుని, "సాంబమూర్తిగారింటికి పోయొద్దాం పద-" అని కల్యాణిని చెయ్యి పట్టుకుని నడిపించుకుని తీసుకుపోయింది.

"ఏమే ప్రొద్దున్నే ఇలాగొచ్చావు?" అన్నది వరలక్షమ్మగారు, ఆవిడకి రక్తపోటు హెచ్చుగా వుంటుంది. ఆయాసంగా వరండాలో కూర్చుని.

"నా ఒక్కగా నొక్క కొడుకు నాయనోయ్-" అని మళ్లీ ఏడుపు మొదలుపెట్టింది అమ్మ -

"అంతా అబద్ధం పిన్నిగారూ-" అని చెప్పాలని కళ్యాణి పెదవులు కదిల్చింది. కానీ, అమ్మ ఎదుట ఆమాట అనగలదా తను !

కాసేపు ఏడ్చి చివరికి, "గోవిందు సుబ్బారావుగారి వెంట విశాఖపట్నం వెళ్ళాడని నా కనుమానంగా వుంది అక్కయ్యగారూ - ఇవ్వాళ నేనూ విశాఖపట్నం వెళ్ళొస్తాను - కాస్త నే నొచ్చేవరకూ దీన్ని మీ ఇంట్లో వుంచుకోండి - పనిమనిషి రావటంలేదన్నారుగా - కాస్త మీ చేతి క్రింద వుంటుంది." "అదేమిటి! వాడు సుబ్బారావుగారి వెంట వెడితే - నీకు రేపు కార్డుముక్క వ్రాయరూ? నువ్వెందుకు డబ్బు దుల్చుకుని పరిగెత్తడం? పిచ్చా? చాదస్తమా?" అన్న దావిడ - దానికి అమ్మ ఒక తెలుగుసినిమా అంత కథ చెప్పింది. గోవిందుడు అమాయకుడు - వాడికి సుబ్బారావుగారంటే ప్రేమ - ఎందుకంటే ఎప్పుడైనా పది పైసలిచ్చి చాక్లెట్లో, వేరుసెనగ పప్పులో కొనిపెడతాడని - కానీ ఆ సుబ్బారావు రాక్షసుడు - వీణ్ణి తనదగ్గర వుంచుకుని తిండిపెట్టడు - తన్ని తగిలేస్తాడు - ఈ వెధవ ఎక్కడికి వెళ్ళాడో ఏమో? "అయ్యో నా గోవిందూ - వెర్రి నాయనా!" అని మళ్ళీ ఏడుపు -

వరలక్ష్మమ్మగారికి విసుగు పుట్టింది.

"ఇంతకీ నీ ఏడుపంతా దాన్ని మా దగ్గర పెట్టుకోవా

లని ! అంతేగా ! అల్లాగేకానీ - నీ బ్రతుకెలాగూ బండలు చేసుకున్నావు - దాన్నైనా ఓ నీడన పడివుండనీ - ఒసేవ్ కల్యాణీ - దొడ్లోకి పదవే-ఇన్ని కాఫీ బొచ్చెలు పంపు దగ్గర పడివున్నయ్-" అని ఆయాసపడుతూ లోపలికి వెళ్ళి పోయింది.

కల్యాణి వెళ్ళి పంపుదగ్గర గిన్నెలు తోమడానికి కూర్చుంది.

ఒక్క కుదుపుతో బస్సు ఆగడంతో, వులిక్కిపడి మళ్ళీ కిటికీలోనుంచి చూసింది కల్యాణి - గుంటూరు వచ్చేసింది - రోడ్డు కటూ ఇటూ పొగాకు కంపెనీలు - కుడి చేతివైపు నీలంరంగు వేసిన మేడ - 'మూర్తీ అండ్ సన్స్'-

అదే సాంబమూర్తిగారిది - ఆ కంపెనీ సాంబమూర్తి గార్ని గొప్పవాణ్ణి చేసింది. ఆయన ఔదార్యం తనకి వూపిరి పోసింది.

అప్పుడు పంపుదగ్గర గిన్నెలు తోమడానికి కూర్చున్న కల్యాణి-పది సంవత్సరాలు అక్కడే వుండిపోయింది. బాబాయి గారు ఎల్లా వున్నారో ? పిన్నిగారు బావున్నారా ? ఎలా వున్నారో ? దమయంతీ, వాసూ-

వాసు ఇప్పుడు బాగా మారిపోయి వుంటాడు-ప్రాక్టీసు పెట్టి వుంటాడు. డబ్బూ, పేరూ సంపాదించుకుని వుంటాడు.

మరి దమయంతో !

దమయంతికి పెళ్లైపోయి వుంటుంది. ఒకవేళ పురిటి కోసం పుట్టింటికి వచ్చి వున్నదేమో !

వాసుకి కూడా వివాహం అయి వుంటుందా?

ఊహు! అయి వుండదు!

వాసుకి తను ఇంకా జ్ఞాపకం వుంటుందా? తను ఎవరని జ్ఞాపకం వుంటుంది? రోజూ, వండి వడ్డించే ఒక బీద పిల్లని జ్ఞాపకం పెట్టుకునే అవసరం అతని కేమిటి? భోజనం చేసేటప్పుడైనా ఒక్కసారి తల ఎత్తి తనవైపు చూస్తాడేమోనని ఎంతో ఆశపడేది తను - ఊహు! ఒక్కసారి తల ఎత్తి తనవైపు చూస్తే అతని బుద్ధిమంతనానికి లోపం కలుగుతుందేమోనని విసుక్కునేది తను -

ఇప్పుడు, డాక్టరైనాక అసలు భోజనం చేయడానికైనా తీరుతున్నదా లేదా? వాళ్ళావిడా, అతనూ ఎదురెదురుగా కూర్చుని హాయిగా నవ్వుకుంటూ భోజనం చేస్తారు- అతను ఎందుకు పెళ్ళి చేసుకోడు? ఏ లేడీ డాక్టర్నో పెళ్ళి చేసుకునే వుంటాడు. ఇద్దరూ కలిసి బ్రహ్మాండంగా ప్రాక్టీసు చేస్తూంటారు. వాళ్ళకేం! వాళ్ళ జీవితాలు పడ్డించిన విస్తళ్లు!

దమయం తెంత మంచిది! ఎన్నిసార్లు అమ్మా, నాన్నా చూడకుండా తనకి డబ్బులిచ్చింది! తన రిబ్బన్లలో, జడ పిన్నుల్లో - పువ్వుల్లో - గాజుల్లో - అన్నింట్లో భాగం పెట్టింది.

జన్మ జన్మలకీ వాళ్ళ ఋణం తీరదు.

అంత మంచివాళ్ళ మధ్యకి ఎంత నిబ్బరంగా వెను

తోంది తను! వాళ్ళ మంచితనమంత మంచివాళ్లు - తను నిజంగా నిబ్బరంగా వెళ్ళడం లేదు. భయంతో! ఆందోళన తోనే వెళుతోంది - ఆ సంగతి తలుచుకుంటే శరీరం గగు ర్పొడుస్తుంది - వాళ్ళెదుట పడడానికి భయం వేస్తున్నది—కానీ తను వెళ్ళాలి - చేసిన తప్పు దిద్దుకోవాలి - అప్పటి దాకా తనకి నిష్కృతి లేదు - శాంతీ, సుఖంలేవు - తనలో ఇంకా మానవత్వం నశించలేదు - పైగా అప్పటికన్నా ఇప్పుడు తాను చాలా పెరిగిందికూడా! తనలోని ఈ పెరుగు దలా, అభివృద్ధీ వాళ్ళు చూడాలి - తాము అన్నంపెట్టి బ్రతికించిన ప్రాణి, తన కాళ్ల మీద తాను నిలబడిందన్న విషయాన్ని వాళ్ళు తెలుసుకోవాలి - అప్పుడు వాళ్లకెంత సంతోషం! బస్సు గుంటూరు స్టాండింగ్‌లో ఆగింది.

తెచ్చి పెట్టుకున్న ధైర్యంతో, సూట్ కేసు తీసుకుని బస్సు దిగింది కళ్యాణి -

రెండేళ్ల క్రిందట, ఇదే బస్సు స్టాండింగ్‌లో బస్సు ఎక్కిన కల్యాణికన్న, ఇప్పుడు ఇక్కడ బస్సు దిగిన కల్యాణి కళ్ళల్లో జీవం వుంది - శరీరంలో మెరుపూ, మొహంలో మంచితనం, గర్వం వున్నాయి.

రిక్షా ఎక్కింది.

బ్రాడీపేట బాగా పరిచయం తనకి.

రెండేళ్ళలో గుంటూరుపట్టణం ఏమీ పెద్దగా మారి లేదు - మార్పు రావడానికి రెండేళ్ళు అనేది పెద్ద పట్టిం

చుకోదగ్గ కాలం కాదు కాబోలు - అవే అడ్డరోడ్లు- అక్కడ అడ్డరోడ్డు మొగదల్లో సాంబయ్య బడ్డీకొట్టు అక్కడేవుంది. ఆరోడ్డు మొదల్లో కూర్చుని రిక్షాలవాళ్లకి కిరసనాయిల్ పోసే ముసలమ్మ - అన్నీ ఎక్కడివక్కడే వున్నాయి.

తనకీ ఉద్యోగాన్ని తెప్పించి పెట్టడానికి కారణభూత మైన లైఫ్ ఇన్స్టిట్యూట్ అదే, ఆ తెల్లమేడలో వుంది - దాని కెదురుగా కిరాణా దుకాణంలో బెంచీమీద కూర్చుని తనమీద విట్లూ, విసుర్లూ కురిపించే నల్లటి కుర్రాడు ఏమ య్యాడో? వెర్రి నాయన! బి. ఏ. పూర్తిచేశాడా - ఇంకా లేదా! సినీమాతారల పేర్లన్నీ పెట్టి తనని పిలిచి ఆనందించేవాడు!

"అయ్యో అపు - ఆపు - ఇక్కడే దాటిపోతున్నాం - ఈ రత్నావళి రంగువేసిన మేడ ముందే దిగాలి -

రిక్షా పదడుగులు వెనక్కి వెళ్ళి ఆగింది -

నీలంరంగు ఫియట్ కారు - బాబాయిగారు ఇంట్లో వున్న సూచన. ఏదీ వాసు బోర్డు లేదు వాకిట్లో - అయినా, ప్రాక్టీసు పెట్టడానికి ఈ ఇల్లేం చాలుతుంది!

అప్పన్న గేటుదగ్గరే వున్నాడు - ఈ రెండేళ్ళలోనూ పాపం బాగా ముసలివాడైనాడు. అప్పుడున్న ఒకటి, అరా నల్ల వెంట్రుకలు కూడా తెల్లవాటిలో కలిసిపోయాయి-

ఇంటి కెవరొచ్చినా, పెట్టే, బేడా అందుకుని లోపల పెట్టడం అలవాటు. అప్పటినుంచీ మారలేదు కాబోలు, చేతిలో సూట్ కేసు అందుకున్నాడు.

"ఏం - అప్పన్నా - బావున్నావా! నన్ను గుర్తుపట్ట లేదా ఏం!" అనడిగింది.

తెల్ల ముఖం వేశాడు అప్పన్న -

"నేను కల్యాణినోయ్-" అప్రయత్నంగానే ఆమె కళ్లల్లోనూ, కంఠంలోనూ కూడా గర్వం తొంగి చూసింది -

"నువ్వా కల్యాణమ్మా!" సంభ్రమంగా చూశాడు.

"అప్పుడే అతగాడిని అడుగుదా మనుకుంది-నాగురించి వాళ్లంతా ఏమనుకుంటున్నారోయ్!" అని. అయినా వాడిని అడిగేదేమిటి!

సరాసరి వంట గదిలోకి వెళ్ళింది.

అక్కడ వంటావిడచేత ఫలహారం చేయిస్తున్నది వరలక్ష్మమ్మ -

"ఎవరే అదీ!" అన్నది కళ్లజోడులోనుంచీ అర్థం కానట్లు చూసి -

"నేను పిన్నిగారూ - కల్యాణిని! -"

"నువ్వాటే!!" వెనక్కి తిరిగింది. ఆవిడని చూడగానే తన కెలాంటి భావాలు కలిగాయో, ఆవిడకీ అలాంటి భావాలే కలిగాయనీ తెలిసింది కల్యాణికి -

పది సంవత్సరాల అనుబంధం! తల్లీ, బిడ్డల మధ్య వుండే అనురాగం, ఆవిడ దగ్గరే తను చవిచూసింది -

కల్యాణికి ఆనందబాష్పాలు వచ్చాయి -

"చెప్పకుండా వెళ్ళిపోతావుటే ! డబ్బివ్వకపోతే మాత్రం - మేము నీకు కానివాళ్ళమా ? ఆమాత్రం డబ్బు నీకు మేము ఎప్పుడూ ఇవ్వనేలేదా ? ఇంతకీ ఉద్యోగంలో స్థిరపడ్డావు - అంతే సంతోషం -" నిష్ఠురమూ, ప్రేమా కలగలిసిన స్వరంతో అడిగింది ఆవిడ.

ఆ మాటకి జవాబు చెప్పే శక్తి కల్యాణికి లేదు. అందుకోసం, "బావున్నారా పిన్నిగారూ ! - ఇప్పుడెలా వుంటున్నారు ?" అని అడిగింది; ఆవిడ దగ్గరగా కూర్చుని—

"నాకేమే బాగాలేక - నిక్షేపంలా వున్నాను. నువ్వెళ్ళిన నాటినుంచీ మాకు సరైన తిండి వుంటేగా - ఈ వంటవాళ్ళంతా సరిగ్గా చేస్తారా ఏమన్నానా ?" అన్నది వరలక్ష్మమ్మగారు - కల్యాణిని కళ్ళనిండా చూస్తూ-

కల్యాణి మనసు చివుక్కుమంది - వీళ్ళంతా తనని మంచి వంట మనిషిగా గుర్తుపెట్టుకున్నారన్నమాట ! అంతకన్నా తన ప్రత్యేకత ఏమున్నది మరి !

ఒకప్పుడు తను వంట మనిషి ! కానీ ఇప్పుడా మాట తనకి వినడానికే బాగాలేదు -

కల్యాణికి ముందు ఉప్మా పెట్టండి - దానికి పంచదార తక్కువవేసి చిక్కని కాఫీ కలిపియ్యండి - ఏ వేళన బయల్దేరిందో ఏమో పాపం-" పిన్నిగారి ప్రేమ.

"దమయంతెక్కడవుంది ? పిన్నీ...."

C. P. BROWN MEMORIAL
90 LIBRARY. CUDDAPAH.
Acc. No. 5521

నిజాయితీ

"దమయంతీ ఇక్కడేవుంది. దాని మొగుడూ ఇక్కడే వున్నాడు - నిరుడు చేశాం దాని పెళ్లి. నువ్వు లేని కొరత ఎంతో అనిపించింది-కనీసం ఎడ్రెస్సైనా ఇచ్చేవు కాదు-ఉత్తరం పంపడానికి - వాసు ఎం. డి. చేస్తున్నాడు - అల్లుడుకూడా డాక్టరే - విశాఖపట్నం ఆస్పత్రిలో ఉద్యోగం - మరి నీకు హైద్రాబాద్ లోనేనా ఉద్యోగం? ఎంతిస్తున్నారేమిటి! ఆ నీళ్లు నీ వంటికి బాగా పడ్డాయి - చక్కగా వున్నావు-" తల నిమిరింది.

"రెండువందల యాభై ప్రస్తుతానికి - పర్మనెంటైతే పెంచుతారు. ఇంగ్లీషు బాగా మాట్లాడ్డం నేర్చుకుంటే రిసెప్షనిస్టు క్రింద వేసుకుని ఇంకా ఎక్కువ చేస్తామన్నారు - ఒక ఇంగ్లీషావిడ దగ్గర ప్రయివేటు పెట్టుకున్నా-"

"నువ్వేంతైనా చేస్తావు - ఓ అయ్యని చూసి ముడేసుకో - ఎప్పటికైనా ఆవని తప్పదుగా! ఎన్నాళ్లు కష్టపడతావు?"

కల్యాణికి నవ్వొచ్చింది. ఒక అయ్యను చూసి ముడేసుకోవాలట! ఎవర్ని చూసుకోవాలి! వంటమనిషి కూతురు - తన తల్లి లేచివచ్చిన మనిషి. వెండి మరచెంబు ఎత్తుకొచ్చిన దొంగ - తన తండ్రి దేశాలంట వెళ్ళిపోయిన వాడు - తన చరిత్ర, తన వంశం తెలిసిన ఏ అయ్య ఉదారంగా తనని ముడేసుకుంటాడు?

తన స్వభావం, తన మంచితనం వరలక్ష్మమ్మగారికి తెలుసు. మరి తన కొడుక్కి ముడెట్టుకోగలదా?

ఏమిటి తనింత పేరాశగా ఆలోచిస్తున్నది!

ట్రేలో మంచినీళ్ళగ్లాసులూ, ప్లేటూ సర్ది "దమయంతికిచ్చిరండి-వస్తూ కల్యాణి వచ్చిందని దానికి చెప్పండి-" అని వంటావిడని పైకి పంపింది.

"తినవే కల్యాణీ! - నీలాగా ఎవరూ చెయ్యలేరనుకో- నీకు జ్ఞాపకంవుందా? ఆ పెద్ద కళాయి గిన్నెతో నువ్వు ఉప్మా చేస్తే - ఆఖర్ని నీకూ నాకూ కూడా వుండేదికాదు-"

గతం తలుచుకుంటోంది ఆవిడ-

పది నిమిషాల్లో పరిగెత్తుకుంటూ దమయంతి వచ్చింది.

"ఏమే కల్యాణీ-ఇంత కాలానికా వచ్చేది! నయం - ఇవ్వాళొచ్చావు - రేపు నేను వెళ్ళిపోయేదాన్నే - ఒక్క రోజు ఆగితే నీకు నేను డబ్బిచ్చి పంపేదాన్నికాదుటే-అంత కోపం అంటే నీకూ?" వస్తూనే గలగలా మాటాడుతూ ప్రక్కని కూర్చుంది.

"పిచ్చి దమయంతీ! మనకోసం ఆఫీసువాళ్ళు ఇంటర్వ్యూలు వాయిదా వేస్తారటమ్మా ఎక్కడైనా?"

దమయంతికి పెళ్ళి కళ వచ్చింది. అందానికి అలంకారం తోడైతే చెప్పేది ఏముంటుంది!

"మరి నువ్వు ఎల్లా వెళ్ళావే! నీకు డబ్బెవరిచ్చారు?" ఆటంబాంబులాంటి ప్రశ్న వేసింది దమయంతి-

కల్యాణి తనను తాను సంబాళించుకుంటూ, "ఆ సంగ

తులు తరువాత మాట్లాడుదాం - మరి నీ క్రొత్త కాపురం విశేషాలు చెప్పు-" అన్నది -

కల్యాణీ, దమయంతీ చాలాసేపు మాట్లాడారు-

"ఇవ్వాళ రెండో శనివారం, రేపు ఆదివారం - ఎల్లుండి ఏదో ముస్లిం పండగట - మూడురోజులు సెలవులు కలిసొచ్చాయని వచ్చాను - రేపు రాత్రికి వెళ్లిపోతాను - నా అదృష్టం బావుండి నువ్వుకూడా ఇక్కడే వున్నావు-" అన్నది కల్యాణి -

ఇంట్లో దీపాలు వెలిగాయి. కార్యక్రమాలన్నీ యధా విధిగా జరిగాయి - కల్యాణి అభివృద్ధికి సాంబమూర్తిగారు చాలా సంతోషించారు - వాసు భోజనానికి వచ్చినప్పుడు, వరలక్ష్మమ్మగారే కల్యాణిని పిలిచి "దీన్ని గుర్తుపట్టావట్రా వాసూ-రెండేళ్లల్లో ఎల్లా మారిపోయిందో - మన కల్యాణిరా ఇదీ!" అంటూ పరిచయం చేసింది -

"వెరీగుడ్ -" అన్నాడు కళ్లెత్తి చూసి-

అంతకన్నా అతన్నుంచి ఇంకేం ఆశించలేదు కల్యాణి.

వాసుకూడా మారిపోయాడు - కాలానికి తగ్గట్లు వేష భాషలు మారవా మరి! అందులోనూ చదివేది పెద్ద చదువుకదా!

భోజనాలయాక ఎవరి పడకగదుల్లోకి వాళ్లు వెళ్లి పోయారు -

కల్యాణీ, వరలక్ష్మమ్మగారూ నడుమ హాల్లో మంచాలు వేసుకున్నారు.

తన ఆఫీసు ఎక్కడో, తను ఎక్కడుంటుందో, ఎలా తింటుందో, ఆఫీసులో ఏం పనో అన్నీ అడిగింది. దమయంతి మొగుడు ఎంత మంచివాడో, దాన్ని ఎంత అపురూపంగా చూసుకుంటాడో వర్ణించింది - దమయంతికి ఏమేం కట్న కానుకలు యిచ్చారో, ఎన్ని లాంఛనాలు జరిపారో అన్నీ చెప్పింది - వాసుకి ఎంతెంత గొప్ప సంబంధాలొస్తున్నాయో వివరించింది - తన ఆరోగ్యం రోజు కొక విధంగా ఎలా మారుతోందో చెప్పింది - అన్నీ అయ్యాక, "నువ్వు పెళ్లి చేసుకో దలుచుకుంటే బాబాయిగార్నడిగి నీకు డబ్బు అప్పుయిస్తాను- ఎక్కడైనా సంబంధా లున్నాయేమో చూడమన్నావంటే!" అన్నది-

కల్యాణికి మళ్ళీ నవ్వొచ్చింది.

ఆరోజు తను అడిగింది వందరూపాయలు అప్పు - క్రికెట్ మ్యాచ్‌లకీ, సభలకీ సమావేశాలకీ, క్లబ్ వార్షికోత్సవాలకీ విరివిగా విరాళాలిచ్చి పేరు సంపాయించుకున్న సాంబమూర్తిగారు ఆ ఒక్క వందరూపాయలే తనకి యివ్వలేదు- మరి పెళ్లికి వేల సంఖ్యలో అప్పు ఇస్తారా? ఏం చూసి ఇస్తారు? తన రెండువందల రూపాయల ఉద్యోగం చూసి ఇస్తారా?

"నా కిప్పుడేం పెళ్లిలే పిన్నీ - ఇన్నాళ్లూ కష్టపడ్డాను- ఓ నాలుగేళ్లు హాయిగా వుండనియి - ఆ తరువాత నన్ను నన్నుగా యిష్టపడే వాడెవరైనా దొరికితే అప్పుడు అవసర

మైతే మీకన్న నాకు ఇంకెవరున్నారు అడగడానికి !" అన్నది నిర్లిప్తంగా.

చాలాసేపు మాట్లాడి అలసిపోయి నిద్రపోయింది ఆవిడ - కల్యాణికి మాత్రం నిద్ర రాలేదు.

ఈ రెండేళ్ళుగా తనూ ఇంకో అమ్మాయి మంజరీ కలిసి ఓ గది అద్దెకు తీసుకుని వుంటూన్నారు - ఇంటికైన ఖర్చు ఇద్దరూ పంచుకుంటారు - అన్నీ యంత్రవతుగా జరిగి పోతున్నాయి - సంతోషించడానికీ విచారించడానికీ ఏమీలేదు.

కానీ ఇక్కడ తను గడిపిన జీవితం అంతా గుర్తు వస్తున్నది - పదమూడేళ్ళ తనను అమ్మ ఇక్కడ దించి, గోవిందును వెతికే నెపంమీద వెళ్ళిపోయింది. అమ్మ వెళ్ళిన వారంరోజులకి తనకి తెలిసింది. అమ్మ ముందుగా సుబ్బా రావుగారితో గోవిందును పంపి, తరువాత తనూ ఆయన దగ్గరకే వెళ్ళింది. అక్కడ ఆయనకు వంట చేస్తున్నది- గోవిందును చదివించుకుంటున్నది. తాను రావడం యిష్టం లేదు.

పదిరోజులకి ఉత్తరం వ్రాసింది వరలక్ష్మమ్మగారికి -

"నా బిడ్డను మీ కడుపులో పెట్టుకోండి - పొట్ట గడవక నేనిక్కడ వంటకి చేరేను-" అని ఏమేమో వ్రాసింది - వీళ్లు తనని ఎందుకు కడుపులో పెట్టుకున్నారు ?

తను పదమూడేళ్ళదైనా ముప్పై ఏళ్లవాళ్లు చేసే చాకి

చేసింది - వాళ్లు పొమ్మంటే ఎలాగోనని క్షణం క్షణం భయ పడుతూ, వణికిపోతూ, వాళ్ళకి వంగి వంగి నమస్కారాలు చేస్తూ బ్రతికింది - అంత కష్టపడింది కనుకనే తన బ్రతుకు బజారుపాలు కాలేదు - లేకపోతే ఈనాడు తను ఎక్కడ వుండేదో! తన ఈడుదే అయిన దమయంతి రంగు రంగుల పరికిణీలు కట్టి, రకరకాలు నగలు వేసుకుని దర్జాగా స్కూలుకు వెళుతుంటే తను ఇన్ని గిన్నెలు వేసుకుని పంపుదగ్గర కూర్చో డానికి ఒక్కొక్కరోజు ఏడుపు వచ్చేది కళ్యాణికి. కాని ఆ గిన్నెలు తను తోమలేనని చెబితే, వాళ్లు వెళ్లిపొమ్మంటే ఎక్కడికి వెళుతుంది! ఆ వూహకి వణికిపోయేది - దమ యంతికి చిన్న దెబ్బతగిల్తే వాళ్ళమ్మ కంగారు పడిపోతుంది. ఆ పిల్లతోపాటు తనుకూడా బాధపడుతుంది. దగ్గర కూర్చో పెట్టుకుంటుంది. ఒక్కరోజైనా అమ్మ తనని అల్లా చేర దీసిందా? ఇంత నిర్దయురాలైన అమ్మకి తనెందుకు పుట్టిందో!

ఓ నెలరోజుల తరువాత తనకి దొంగబుద్ధి లేదనీ, వళ్లువంచి పని చేస్తుందనీ నమ్మకం కలిగినాక, తనమీద వాళ్లకి ఆదరం పుట్టింది - దమయంతి కట్టి వదిలేసిన పరికి ణీలూ, జాకెట్లూ, రోజూ తలకి రాసుకోడానికి నూనే, అప్పు డప్పుడూ తలంటి స్నానం - యెప్పుడైనా పండక్కి క్రొత్త బట్టలూ - అల్లా సౌకర్యాలు పెరిగాయి. ఇంట్లో అందరికీ ఏది కావల్సినా 'కల్యాణీ' అనడం అలవాటైపోయింది-

దమయంతి స్కూలునుంచీ రాగానే ట్యూషన్ మాస్టారు వచ్చేవారు -

ఒకరోజు ఆయన వచ్చేటప్పటికి తను వరండాలో కూర్చుని గోరుచిక్కుడు కాయలు తరుగుతున్నది -

"ఈ పిల్ల యెవరు?" అన్నాడు మాస్టారు.

"కళ్యాణి-" అంది దమయంతి-

మాస్టారు నవ్వారు - "కల్యాణి అంటే నాకేం తెలుస్తుంది. మీ మామయ్య కూతురో - పిన్నిగారమ్మాయో!-"

"కాదండీ-అది-అదీ-మా ఇంట్లో వుండే కల్యాణి-"

మాస్టారు మళ్లీ నవ్వారు-" నువ్వు ఇంట్లో వుండే దమయంతివి కావా?"

అప్పుడు కల్యాణి లేచి నిలబడి, "అంటే - నేనిక్కడ పని చేస్తానండి-పనిమనిషిని-" అంది-

మాస్టారు ఆశ్చర్యపడుతూ, "బంగారంలా వున్నావు- నువ్వు పనిమనిషివా!" అన్నారు.

పనిమనుషుల్లో బంగారంలాంటి వాళ్లు వుండకూడదనో, బంగారంలా వున్నవాళ్లు పని చెయ్యకూడదనో!

వాళ్ల నాన్నా- అమ్మా ఇక్కడ లేరండీ! దాన్ని మా ఇంట్లో వుంచి వాళ్లమ్మ వెళ్లిపోయింది! పాపం-" అంది దమయంతి.

"చదువేమైనా వచ్చా నీకు?" మాస్టా రడిగారు-

"ఆరో క్లాసుదాకా చదివానండీ ఎలిమెంటరీ స్కూల్లో-"

"నీకిచ్చే జీతం ఏం చేసుకుంటావు? అంతా ఇక్కడే జరిగిపోతుందిగా?"

కల్యాణి మాట్లాడలేదు - ఎందుకంటే తనకి జీతం అంటూ ఏమీ లేదు -

మాస్టారు కల్యాణివంక జాలిగా చూసి వూరుకున్నారు-

తరువాత వరలక్ష్మమ్మగారిని పిలిచి, "ఆ పిల్లకి జీత మెంతిస్తున్నారండీ!" అనడిగారు.

ఆవిడ తెల్లబోయింది. అసలు కల్యానికి జీతం యివ్వాలని ఆవిడకి స్ఫురించలేదు -

కాసేపాగి మాస్టారే అన్నారు -

"నాకు నెలకి పది రూపాయలివ్వండి - నాలుగేళ్ళలో ఈ పిల్లని మెట్రిక్ కి కూర్చోపెట్టి ప్యాస్ చేయిస్తాను - ఎంత కాలమని ఇల్లాగ పనిచేసుకుని బ్రతుకుతుంది-" ఆ సలహాకి ఎవరూ బదులు పలకలేదు.

వారంరోజు లైనాక మెల్లిగా తనే పిన్నిగార్ని అడిగింది - "నేను చదువుకుంటాను పిన్నిగారూ అని-"

దానిమీద ఇంట్లో అందరూ తర్జన భర్జనలు చేసి చివరికి ఎలాగో సమ్మతించారు.

భోజనం పెట్టి, బట్టలిచ్చి, చదువుచెప్పించి పైగా పుస్తకాలకూ పెన్సిళ్ళకూ కూడా డబ్బులివ్వడానికి వాళ్ళకి కష్టంగానే వుండేది-

అప్పుడప్పుడూ తల్లికి తెలియకుండా పుస్తకాలకి దమయంతి డబ్బులిచ్చేది-ఒక్కోసారి తనకోసం అని చెప్పి

నోట్పులు కొనుక్కుని, అవి ఎవరూ చూడకుండా కల్యాణ కిచ్చేది.

ఒకొ్కక్కసారి కళ్యాణికి పెన్ను కొనిపెట్టి, తన పెన్ను పోయిందని అబద్ధం ఆడింది. ఇలాగే తనకోసం దమ యంతి చాలా చేసింది. ఆమె కట్టే అద్దాల పరికిణీ తను బావుందని మెచ్చుకుంటే - దాన్ని బ్లేడుతో చించి, 'చిరిగిన పరికిణీ నేను కట్టను' అంటూ కల్యాణి కిచ్చేసింది. ఇంట్లో పని చేసుకుంటూ, అడిగిందల్లా అందిస్తూ - చదివే కళ్యాణికి మెట్రిక్ ప్యాస్ కావడానికి అయిదేళ్లు పట్టింది. ఈ అయి దేళ్ళల్లో కళ్యాణి పనిమనిషి స్థాయినుంచీ పెరిగిపోయి, ఇంట్లో వంటకూడా స్వంతం చేసుకుంది. ఒక్క వంటేకాదు- కూరలు తెప్పించడం దగ్గర్నుంచీ అందరికీ బట్టలు ఇస్త్రీ చేయించిపెట్టడం - ఎవరికిష్టమైనవి వాళ్ళకు అమర్చడందాకా అన్నీ ఆమె చేతిమీదగానే జరిగేవి - మెట్రిక్ ప్యాసయినాక మాస్టారే సలహా యిచ్చారు. ఇంటి దగ్గరే వున్న టైప్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరమని - మాస్టారెలా వున్నారో పాపం! రేప్రొద్దున వెళ్ళి చూసిరావాలి! దమయంతిని అడగడం మర్చిపోయింది.

తీవిగా కాలేజీకి వెళ్ళి చదువుకుని, మళ్ళీ ట్యూషన్లు చెప్పించుకుని, గైడ్లు కొనుక్కుని థర్డ్‌క్లాసులో బి. ఏ. ప్యా సైంది దమయంతి - రాత్రిపూట నిద్ర మేల్కొనడంకోసం 'టీ' తాగేది. బలానికి పాలు తాగేది. అల్లా సుఖంగా, హాయిగా చదువుకుని డాక్టర్ని పెళ్ళి చేసుకుని సినీమాలు చూస్తూ షికార్లుచేస్తూ గడిపేస్తూంది.

డబ్బుగలవాళ్ళందరిదీ ఒకటే జబ్బు!

వాళ్లు ఒక్క గంట వినోదంకోసం, ఒక్క చిన్న సరదాకోసం ఎన్నివేల రూపాయలైనా ఖర్చు చేసుకుంటారు. కానీ పరాయిదైన ఒక ప్రాణి జీవితం నిలబెట్టడానికి, ఆ దీపం ఆరిపోకుండా కాపాడడానికి ఒక్క రూపాయి ఖర్చుపెట్టడానికైనా సరే లాభనష్టాల బేరీజులు వేసి, ఆలోచించి, చివరికి దాన్ని నష్టంగా పరిగణించి కొట్టివేస్తారు. ఎప్పుడో ఒక్కసారి ఒక్క పెళ్ళికి కట్టడానికి ఐదువందలైనా ఖర్చుచేసి ఒక్క పట్టుచీర కొంటారు. ఒక్క వంద రూపాయలతో మరో ప్రాణి జీవితానికి మహోపకారం చెయ్యగలిగినా — అది వాళ్లకి దుబారాగా అనిపిస్తుంది.

తమదగ్గర అక్కర్లేనంత ధనం వున్నా, ఆ ధనం అంతా తమకే వుపయోగపడాలి, లేదా ఎవరికీ వుపయోగం లేకుండా కట్టలు కట్టి బీరువాలో వుంచాలి. అంతేకాని, ఒక్క రూపాయి లేనందువల్ల జీవితాలే తారుమారయేవారి బ్రతుకులు మార్చడానికి పైసాకూడా సహాయం చెయ్యరు. ఇంత స్వార్థం, ఆలోచనారాహిత్యం మనుష్యుల్లో ఎందుకు సిరపడిపోయిందో కల్యాణికి అర్థంకాదు. అమాటే ఎన్నోసార్లు మాస్టారితో అంది కల్యాణి.

"ఇది ఎంతో కాలంగా ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న న్యాయం తల్లీ - ఒక్క రోజులో ఇది మారదు—" అన్నా రాయన.

పాపం మాస్టారు బండెడు సంసారాన్ని ఒక్క చేతి

మీదుగా యీదుతున్నారు. సంపాదించేవా డొక్కడూ, తిని కూర్చునేవాళ్ళు పదిమందీను. ఎన్ని ఏళ్ళనుంచీ చేస్తున్నా ఎదుగూ బొదుగూలేని ఉద్యోగం. ఏడాదికి ఇంక్రిమెంటు అయిదు రూపాయిలైతే, ఖర్చు అయిదు వందలు పెరుగు తుంది. దానికి తగ్గట్టు ఇంట్లో బంధు మర్యాదలూ, మిథ్యా గౌరవం నిలబెట్టుకోడానికి పడే పాట్లూ - ప్లాన్ లేని ఖర్చూ- పిల్లలకీ ఇంటావిడకీ జబ్బులూ - మారని సంప్రదాయాలూ - అటు ఆఫీసులో గొడ్డు చాకిరీచేసి, ఇటు ప్రయివేట్లమీద సంపాదించి ఇల్లు లాక్కొస్తున్నాడు మహానుభావుడు - ఇంత కష్టం తానొక్కడే భరించడానికైనా సిద్ధపడతాడుగానీ, పెద్ద కూతురు ఉద్యోగం చేస్తానంటే ఇష్టపడడు. కొడుకు కూరల వ్యాపారం పెడతానంటే యిష్టపడడు.

ఈ మధ్యతరగతి మనుష్యులు మారరు - వాళ్ళల్లో మార్పు రావాలంటే అది బలవంతంమీద రావాల్సిందేగానీ, త్వరగా మనస్ఫూర్తిగా చైతన్యవంతంగా రాదు.

వరలక్ష్మమ్మగారు నిద్రపోతున్నారు. కల్యాణికి నిద్ర రాలేదు. ఆమె ఆలోచనలు అల్లిబిల్లిగా సాగిపోతూనే వున్నాయి. సుబ్బారావుగారితో వెళ్ళిపోయిన అమ్మ అక్కడే స్థిరపడిపోయింది. గోవిందుని చదివించుకుంటోంది. ఒకసారి వచ్చింది. తను మెట్రిక్ ప్యాసయిన క్రొత్తలో -

రక్త సంబంధమైన బాంధవ్యాన్ని సహితం ధిక్కరించ గలిగిన ఆవిడ స్వార్థస్వభావాన్ని అసహ్యించుకుంది కల్యాణి.

"వస్తావేమిటే! అక్కడేమైనా ఉద్యోగం చూసు కుందూగాని!" అంది.

"ఎందుకమ్మా- నేను వీళ్లనే నమ్ముకున్నాను. అమ్మా-నాన్నా! వీరే అనుకున్నాను. నా రెక్కలే నాకు అన్నం పెడతాయి - నాకోసం నువ్వేం బాధపడకు- సుఖంగావుండు" అంది కల్యాణి.

"అదేమిటే! నేనుమాత్రం అక్కడ సుఖపడుతున్నానా? నేను బ్రతుకుతూన్న అవినీతి బ్రతుకునీడ నీమీద పడకూడదనీ-నువ్వైనా ఒక పద్ధతిగా, నీతిగా బ్రతకాలనీ నేను నీకు దూరంగా వున్నాను. అర్థం చేసుకో తల్లీ-" అంటూ కంటికి కడివెడుగా ఏడ్చింది.

తన ఊహకి సిగ్గుపడాలో, ఆమె చెప్పింది నమ్మకూడదో అర్థంకాని కల్యాణికి తల్లిని చూస్తే జాలేసింది.

"ఊరుకో! అమ్మా కొన్ని బ్రతుకులంతే! గోఎందుకి ఉద్యోగం వచ్చాకైనా జీవితంలో స్థిరపడు" అని తల్లిని ఓదార్చి పంపింది.

టైపు, షార్టుహాండులు ప్యాసయేసరికి మరి మూడేళ్లు గడిచాయి. పరీక్షఫీజులకోసం, ఇంకా వాటికయే ఖర్చుల కోసం ఎన్నో అగచాట్లు పడింది కల్యాణి - పాత బట్టలు వేసుకుని టైపు ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్ళే తనని సరదాకి టైపు కోసం వచ్చే అమ్మాయిలు వెక్కిరించేవారు. ఒక్కొక్కసారి అక్కడ్నేని జాలి ప్రదర్శించేవారు. మనుష్యులు ఎవరగడాని కెందుకు ప్రయత్నించరో? అనుకునేది కల్యాణి.

ఏది ఏమైనా తనకష్టాలు గట్టెక్కాయి. రేపు

సాయంత్రం తనొచ్చినపని వీళ్లకి చెప్పేసి, భారం దించుకుని తను వెళ్లిపోవాలి - తనమీద వీళ్లకీ చాలా మంచి అభిప్రాయం వుంది. అది నిలబెట్టుకోవాలి. తను అమ్మ లాంటిది కాదు. ఆమె జీవితంకన్నా భిన్నమైన జీవితం గడపాలని, సంఘంలో తను ఓ మనిషిగా గుర్తింపపడాలని పట్టుదలతో, సహనంతో కృషిచేసి సాధించింది. తన నడతలో మచ్చా వుండకూడదు. అందుకే ఇప్పుడు వీలు కల్పించుకుని వచ్చింది.

అల్లా నిర్ణయించుకున్నాక కల్యాణికి నిద్రవచ్చింది.

తెల్లవారి కల్యాణిని దమయంతి భర్తకి పరిచయం చేసింది.

"ఇవ్వాళొక్కరోజూ దీనితో గడిపి, మనం కూడా సాయంత్రం వెడదామండీ!" అన్నది.

"అలాగే కానియ్-" అన్నాడు అతను - రోజంతా కబుర్లతో, కేరమ్స్ ఆడుతూ గడిచిపోయింది - కల్యాణి ప్రయాణం మర్నాటికి వాయిదా పడింది - దమయంతిది కూడా. అందరూ సినిమాకి పోయారు - వచ్చాక సరదాగా భోజనంచేశారు - ఇప్పుడు కల్యాణి డైనింగ్ టేబిల్‌మీద అందరితో కూర్చుని భోజనం చేసింది.

వారి దృష్టిలో ఆమె స్థాయి పెరిగింది.

డబ్బు మనిషికి కాలూ చెయ్యీ లాంటిదేకాదు. అసలు అదే ప్రాణవాయువని కల్యాణి చాలాసార్లు అనుకుంది.

మామూలుగా కల్యాణీ, వరలక్ష్మమ్మగారూ హాలులో మంచాలు వేసుకుని పడుకున్నారు -

అందరూ పడుకోడానికి వెళ్ళాక, "ఇప్పుడు నే నెందుకు వచ్చానో మీకు చెపుతాను పిన్నిగారూ! "అన్నది కల్యాణి మంచంమీద కూర్చుని -

"చెప్పవే! నేను నిన్ననే అన్నానుగా! పెళ్ళికి డబ్బు కావాలంటే బాబాయిగారిస్తారనీ - నెమ్మదిమీద తీరుద్దువులే ఎంతకావాలో చెప్పు -"

కల్యాణి నవ్వింది - "పెళ్ళి విషయంకాదు పిన్నీ - చాలా ముఖ్యమైన విషయాం."

"ఊ-చెప్పు త్వరగా-"

కల్యాణి గుండె వేగంగా కొట్టుకుంది - ముఖం ఎర్రగా కందిపోయింది. అరిచేతులకీ నుదురుకీ విపరీతంగా చెమట పట్టింది. మనిషి నిలువునా వణికిపోయింది.
అల్లా వణికిపోతూనే లేచి నిలదొక్కుకుని, తన సూట్ కేసు తెరచి, అందులోనుంచీ ఒక పేకెట్ తెచ్చి ఆమె ముందు పెట్టి, "ఇది తీసుకో పిన్నీ-" అన్నది. ఆమె పెదవులు ఎండిపోయాయి.

"ఏమిటే ఇదీ! నాకు బహుమానమా!" ఎంత సంతోషం, కల్యాణి ఔననలేదు - కాదనలేదు.

వరలక్ష్మమ్మగారు ప్యాకెట్ విప్పదీసింది. గులాబీ రంగు ఉల్లిపొరకాగితంలో చుట్టిన వెండి కంచం -

"ఇదేమిటే! ఈ చాదస్తం - ఇంత ఖరీదైనవి ఇచ్చుకుంటారటే ఎక్కడన్నా - అయ్యో నీ అమ్మకడుపు బంగారం కానూ - నువ్వు చేసిన చాకిరీకి తగ్గట్టుగా ఏదో మేం సాయం చేశామేగానీ - ఇందులో మాదేం వుందీ - అంతా నీ అదృష్టం-" ఆవిడ వాక్ప్రవాహానికి అడ్డుకట్ట ఎలా వేయాల్లో తెలియని కల్యాణి తెల్లబోయి కూర్చుంది.

కానీ ఎంతసేపు కూర్చుంటుంది! నిజం చెప్పవలసిందేకదా!

"ఇది మీకు బహుమానం కాదు పిన్నీ - అది మీదే - నేను ఆరోజు మీ ఇంట్లోనుంచీ ఎత్తుకుపోయాను - అందుకోసం మళ్ళీ చేయించి తెచ్చాను - అది తీసుకుని నన్ను క్షమించండి పిన్నీ - ఆ పరిస్థితుల్లో అంతకన్న గత్యంతరం లేకపోయింది-" కల్యాణికి కన్నీళ్లొచ్చాయి.

చిత్తరువే అయిపోయిందావిడ.

"అది నువ్వాటే తీసుకుపోయిందీ-" అన్నది నమ్మలేనట్లు -

"ఒక్క యాభై రూపాయిలకోసం తెలిసినవాళ్ళందర్నీ అడిగాను - ఆ ఉద్యోగం నాకు తప్పకుండావస్తుందనే నమ్మకం నాకుంది - ఇంకేం చెయ్యను!" తల వంచుకుంది - వరలక్ష్మమ్మగారు ఆలోచనలో పడిపోయింది. తన ఇంట్లో ఎనిమిదేళ్లు వున్నదీ కల్యాణి. చదువుకుంది. తిన్నది-బట్ట కట్టింది - రెండు ఇంటర్వ్యూలకి సాంబమూర్తిగారే డబ్బిచ్చి పంపారు.

దాని జీతంగాక పైన ఎంత సొమ్మని యిస్తారు? అందుకే ఇవ్వలేదు. అందుకోసం వెండికంచం ఎత్తుకు పోయిందా కల్యాణి!

కల్యాణి వెళ్ళిన మూడు రోజులకి కంచం గురించిన ఆరా వచ్చింది -

"అది వుంటే అన్నీ చూసుకునేది -" అని కళ్యాణిని గురించి తలుచుకుంటూ ఇల్లంతా వెతికింది. ఎక్కడా కని పించలేదు. కల్యాణిమీద అప్పటినుంచీ ఇప్పటివరకూ అను మానమే రాలేదు - పనిచేసే సుబ్బిని నానా మాటలూ అని పనిలోనుంచీ తీసేశారు -

"పిన్నీ - అది దాచుకుని నన్ను క్షమించు-" అన్నది కల్యాణి కళ్ళు తుడుచుకుంటూ -

భలేదానివే - ఏదో ఆరోజు అవసరంకొద్దీ అలా చేశావు - మళ్ళీ చేయించి తేవాలా ఏం? మేమేం లేక ఇబ్బందిపడుతున్నామా? పాపం నీ రెక్కలకష్టం-" అని మాట వరసకి అంటూనే దాన్ని బీరువాలో దాచేసింది ఆవిడ.

ఆపైన ఎవరికీ మాట్లాడాలనిపించలేదు - ఎవరి ఆలోచ నల్లో వాళ్లు మునిగిపోయారు.

ఆరోజు -

హైదరాబాద్‌లో ఒక ప్రయివేటు కంపెనీలో టైపిస్టు

ఉద్యోగానికి ఇంటర్వ్యూ వచ్చింది. అది తనకి తప్పకుండా వస్తుందని కల్యాణి నమ్మకం. తనకి టైపు స్పీడు బాగావుంది కాంపిటీషన్‌లో ఆంధ్రలో సెకండ్ వచ్చింది. షార్ట్‌హ్యాండ్ కూడా పరవాలేదు. మంచి మార్కులతోనే ప్యాసైంది. ప్రయివేటు కంపెనీ కనుక మెరిట్ చూస్తారని నమ్మకం తనకి.

పిన్నిగారూ బాబాయిగారూ ఇద్దరూ డబ్బు లేద న్నారు. దమయంతి అంతకు ముందురోజే నాలుగువందల రూపాయలు పెట్టి చీరెలు కొన్నది. ఆమె కూడా లేదన్నది. పైగా రెండురోజులు ఆగమంది. మాస్టారు అసలే లేదన్నారు. ఇంకా తెలిసిన ఇద్దరు ముగ్గురు కూడా లేదన్నారు.

ఏం చేయాలో తోచలేదు. నిక్షేపంలాంటి ఉద్యోగం- ఎన్నాళ్ళిలా తను పరాయివాళ్ళ ఇల్లు కనిపెట్టుకుని వుంటుంది? తన చదువుకి సార్థకత ఎప్పుడు?

కాలు కాలిన పిల్లిలా ఇల్లంతా తిరిగింది.

ఈ రాత్రికి బస్సు ఎక్కితే తెల్లవారి హైదరాబాద్ చేరుతుంది. పదిన్నర గంటలకి ఇంటర్వ్యూ!

డబ్బులేక మానుకుంటే ఎలా? ఎలా?

వంట చేసింది. గిన్నెలు సవరించింది.

ఆందోళన _ ఆరాటం.

వంట ఇంట్లో కంచాలు సర్దుతుంటే కనిపించింది చిన్న

వెండి కంచం. దమయంతి చిన్నప్పటిది. బాగా సొట్టలుపడి అరిగిపోయింది. వుపయోగించక మూల పడేశారు. బీరువాలో దాచుకోరు. దాన్ని తను అమ్మేసుకుంటేనో? అలాంటి పని చెయ్యడానికి ఎంత సాహసం కావాలి? ఆ కంచం ఎలాగూ మార్చాలిసిందే! ఉద్యోగం వస్తే మళ్ళీ చేయించి యివ్వ కూడదూ తను? ఎంతో ఆలోచించింది. అటూ ఇటూ తిరిగింది - ఔననీ, కాదనీ తటపటాయించింది. చివరికి బజారుకి వెళ్ళింది. అమ్మితే నూట యాభై రూపాయలొచ్చాయి. వాటిఖరీదులు నిజంగా తనకి తెలీవు - తన అవసరంకొద్దీ, తనక దేచాలు - ఇంటికొచ్చి రెండు చీరెలు సంచిలో పెట్టుకుని, "నేను వెళ్ళొస్తాను పిన్నిగారూ-" అని చెప్పింది.

"డబ్బు దొరికిందటే! ఎక్కడ తెచ్చావూ?" అన్నది పిన్నిగారు.

"తెలిసినవాళ్ళదగ్గర ఓ యాభై తెచ్చాను-" అని అబద్ధం చెప్పింది -

అంతే -

ఆరోజునుంచీ తనెంత గిల్టుకాన్షెస్ ఫీలయిందీ ఎవరికీ చెప్పలేదు. అది అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది.

నిజానికి ఆ కంచం తాను ఎత్తుకుపోయిందని ఎవరూ అనుమానించరని తనకి తెలుసు. తను అది తెచ్చి యివ్వక పోయినా ఫరవాలేదనీ తెలుసు.

కానీ ఇన్నాళ్ళూ కష్టపడి, ఒక స్థాయికి పెంచుకొన్న

తన వ్యక్తిత్వానికి అది మచ్చ అని నమ్మి, తన భారం వదుల్చుకోడానికీ, మురికిని కడిగి వేసుకోడానికీ ఆ కంచాన్ని, వాళ్ళ సొమ్మని వాళ్ళకి తిరిగి తెచ్చిచ్చింది -

అంత నిజాయితీగా తమ సొమ్మను తమకు తెచ్చి యిచ్చినందుకు పిన్నిగారి ముఖంలో పొగడ్తా, సంతోషానికి బదులు అసంతృప్తి నీరసం ఎందుకు చోటు చేసుకున్నాయో అర్థం కాలేదు కల్యాణికి.

తెల్లవారింది-

నిన్నటిలాగ అందరూ సంతోషంగా కళకళ లాడుతూ కాఫీలు తాగారు - వెళ్ళిపోవడానికని సూట్‌కేసు సర్దుకుంది కల్యాణి.

"భోజనం చేసి పోదువుగానిలేవే !" అని బతిమి లాడింది దమయంతి-

ఆ తరువాత ఊళ్లో తెలిసిన వాళ్ళని చూసి రావడా నికి వెళ్ళి మధ్యాహ్నం భోజనం వేళకు తిరిగి వచ్చింది కల్యాణి.

తను వచ్చాక అందరి ముఖాల్లో వచ్చిన మార్పుని కల్యాణి గమనించక పోలేదు. భోజనా లయ్యాయి - వరం డాలో కూర్చుని కల్యాణి హైదరాబాదు జీవితాన్ని గురించి అడిగి తెలుసుకుంటున్నాడు అప్పన్న. వింటూ సంతోష పడుతున్నాడు.

లోపల హాలులో దమయంతీ, ఆమె తల్లీ కూర్చుని మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ సంభాషణ అర్థం కాకుండా చాలా నెమ్మదిగా సాగుతోంది.

అప్పన్నని సాంబమూర్తిగారు పిలిచారు.

కల్యాణి లేచి హాలులోకి వచ్చింది.

"ఎక్కడికి పోతాయ్ గుణాలు! పురిట్లో వచ్చిన బుద్ధి పుడకలతో గాని పోదట! కనకపు సింహాసనమున శునకాన్ని కూర్చోపెడితే మాత్రం వెనకటి బుద్ధి పోతుందా? అందులో వారసత్వంగా వచ్చిన గుణాలు అసలు పోవు -" ఇది దమయంతి స్టేటుమెంటు.

"అందుకే చెప్పానమ్మా - అది వున్న కాస్సేపూ కాస్త సొమ్ములూ - వాచీ జాగ్రత్తగా చూసుకుంటూ వుండు-"

"వెళ్ళిపోతున్నాంగా- అది వుంటుందా ఇంకా-

"ఏమో - ఏం పనిమీదొచ్చిందో - వచ్చినప్పటి నుంచీ చూస్తున్నా- వాసుతో మాట్లాడాలని ఒకటే వేట-" ఇది తల్లి ఆలోచన.

"నీకు గుర్తుందా - నాలుగేళ్ళనాడు - దీనికి ఏదో పరీక్ష ఫీజు కట్టాల్సి వస్తే నాన్నగారు డబ్బు లేదన్నారు - సరిగ్గా అప్పుడే దొడ్లో ఆరేసిన కంచి పట్టుచీర పోయింది - అదీ దాని పనే అయుంటుంది. పెద్ద నిజాయితీ పరురాలని

నమ్మి ఇల్లంతా అప్పజెప్పాం గాసి ఒక్కనాడైనా అనుమా నించామా! ఇంకా చిల్లరా మల్లరా చాలా పోయాయి –" దమయంతి పూర్వస్మృతులు – నిజానికి అప్పుడు పరీక్ష ఫీజు పదిహేను రూపాయలూ తనకి వాసు కట్టాడు – అతను ఫీజు కట్టి రశీదు తెచ్చి తన చేతిలో పెట్టి మాట్లాడకుండా వెళ్లి పోయాడు – తను చేతులు జోడించి దండం పెట్టింది. ఇంకా గుర్తే – ఎంత మధురమైన సంఘటన అది!

"ఈ కంచం సంగతి మనకు తెలిసివుంటుందని అనుకుని వచ్చింది. మనని మంచిచేసుకుని ఏదో లాభం పొందాలని వచ్చి వుంటుంది. ఎక్కడికి పోతాయి నెత్తురులో జీర్ణించిన గుణాలు – దమయంతి తెలివిగలది. బి. ఏ. ప్యాసైందిగామరి!

"వీళ్ళ అయ్య ఒక నాటకాలరాయుడు – ఇద్దరు పిల్లల్ని పుట్టించి, వాళ్ళని నట్టేట్లో పుట్టిముంచి దేశాంత రాలు పోయాడు – ఇక వీళ్ళమ్మ సుబ్బారావుతో లేచి పోయినసంగతి అందరికీ తెలిసిందే! పట్నం పోయాక దీని కెంత షోకు వచ్చిందో చూశావా!"

మరే ఆవు గట్టున మేస్తుంటే దూడ చేలో మేస్తుందా అనీ!"

కల్యాణి రెండు చెవులూ మూసుకుంది. కళ్ళ నీళ్ళు చీరెని తడిపేస్తున్నాయి.

తలుపు కానుకుని స్థాణువులా నిలబడిపోయింది. అల్లా అనంతంగా సంభాషణ సాగి సాగి ఆగిపోయింది.

దమయంతి బైటకు వచ్చింది.

ఆ పిల్లని ఈడ్చి ఈ చెంపా, ఆ చెంపా వాయించా లనిపించింది కల్యాణికి.

తమాయించుకుని కళ్లు తుడుచుకుని లోపలికి వెళ్ళి సూట్ కేస్ చేతబట్టుకు వచ్చి, దాని తాళంతీసి హాలులో గుమ్మరించింది.

దమయంతి బొమ్మలా నిలబడి చూడసాగింది ఆపైన తన చీరెలన్నీ మడతపెట్టుకుని, పెట్టె తాళం వేసుకుని, "వస్తా దమయంతీ" అని వీధిలోకి నడిచింది కల్యాణి.

"అప్పుడే వెడుతున్నావుటే –" అంటూ బయటికి వచ్చింది వరలక్ష్మమ్మగారు.

'అవును వచ్చిన పనైందిగా!' అని వెనక్కి తిరగకుండా గబగబా అడుగులు వేస్తూ వీధి మలుపు దాటింది.

"నేను అమ్మనికాను - నాన్ననికాను - నేను కల్యాణిని కల్యాణిని –" అని గట్టిగా అరవా లనిపించింది ఆమెకి!

"వెడుతున్నావా!" స్కూటర్ ఆపుతూ ఎదురుగా వచ్చాడు వాసు.

తడికళ్ళతో అతనివైపు చూసింది.

"మంచి పాఠం నేర్చుకునుంటావు – జీవితంలో సిద్ధాంతాలకన్నా అనుభవాలే ఎక్కువ వుపకరిస్తాయి - పిచ్చిపిల్లా - నువ్వింకా పెరగాలి – గుడ్ లక్ –"

చేతులు జోడించింది కల్యాణి.